# వంట మనిషి

అసలు వంటావిడను పెట్టే ఆలోచన నాదే కాదు – మా ఆవిడది. నన్ను నాలుగు నెలలు పోరిన మీదటగాని నేను సరేననలేదు. దీనికి ప్రబలమైన సాక్ష్యం తీసుకురాగలను. ఏమండీ, వంట మనిషిని చూద్దురూ – అని ఆవిడ అన్నప్పుడల్లా నేను... ఉన్న ఖర్చు చాలకనా?.. అని అడుగుతూనే వచ్చాను.

నేనీ ప్రశ్న అడగటంలో విడ్డూరం ఎంతమాత్రం లేదు. కొంపలో ఉన్నది నలుగురు ప్రాణులం; ఇంటి ఖర్చు చూడబోతే మూడువందలు. ఇందులో ఇంటి అద్దెలేదు; నా సొంత ఖర్చులేదు: అడపాదడపా తగులుతూండే డాక్టరుబిల్లు లేదు. ఏమీలేకుండానే నెలకు మూడు వందలు.

నేనీమాట అంటే మా ఆవిడకు చాలా ఆగ్రహం వచ్చేది. వంటావిణ్ణి పెట్టకపోగా తాను డబ్బంతా దుబారా చేస్తున్నట్టు నేను ఆరోపణ చేస్తున్నానని, కావలిస్తే లెక్క చూపిస్తానన్నది. కష్టపడి ఒక నెల లెక్క వేసింది కూడా. ఆ నెల 318 రూపాయలు ఖర్చయింది. లెక్కలో కూడిక తప్పులుగాని దుబారాకింద పాటించదగిన అయిటములుగాని లేవు.

కాని, సందేహం సందేహంగానే వుండిపోయింది. ఈ లెక్కే నిజమైతే మూడొందలకంటె తక్కువ సంపాదిస్తూ, ఇంకా పెద్ద కుటుంబాలను నిర్వహించే వాళ్ళ మాటేమిటి? వాళ్ళు సబ్బులు తోముకోవడంలేదా, టూత్ పేస్టు వాడటంలేదా, రెండు పూటలా అన్నమూ, ఒకపూట టిఫినూ తినటంలేదా, వాళ్ళు బట్టలు కట్టుకోవడంలేదా? ఇంత డబ్బు ఖర్చుచేసి మేం ఘనంగా బతుకుతున్న జాడలేమీ లేవు. మా ఆవిడ పేరంటానికి వెళ్ళొచ్చినప్పుడల్లా, ఫలానా ఆవిడ నూరు రూపాయల చీర కట్టుకొచ్చిందనీ, ఫలానా ఆయన కూతురు రవ్వలబేసరి కొన్నదనీ, ఫలాని వాళ్ళ పిల్లలు మఖ్మల్ చొక్కాలు తొడుక్కువచ్చారనీ చెబుతుంది. వాళ్ళూ నాబోటి ఆర్జనపరులే కాని అంతకంటె ఎక్కువ సంపాదించేవాళ్లు కారు – అయితే, చెప్పుకోనవసరమే ఉండదు.

'వంటావిణ్ణి పెట్టు...' అని మా ఆవిడతో అనేలోపల నా చేతిలో వున్న ఒక్కపనీ చేసేశా... "ఇంటి ఖర్చు ఎట్లాగయినా పాతిక రూపాయలు తగ్గేట్టు చూడు, వంటమనిషిని పెడదాం. వంటమనిషి కింక ఎంతలేదన్నా యాభైకి తక్కువ కాదు గద?".. అన్నాను.

ఆనెల మా ఆవిడ గడ్డి పెట్టేసింది. కాఫీ నీళ్ళకాఫీ అయిపోయింది. అన్నంలో ఒకపూట కూరవుంటే ఇంకోపూట పచ్చళ్ళే. పదిహేనో తారీకు తరవాత... ఇక టూత్ పేస్టులేదు. అందరూ పొడరు పెట్టి తోముకోండి.... అని మా ఆవిడ నోటీసిచ్చింది. కొంచెం భోజనానికి ఆలస్యంగా వచ్చిన పూట చప్పచల్లారిన పదార్థాలు తినవలసి వచ్చింది.... కాస్త వెచ్చజేయకపోయావా?... అంటే... ఈ నెలల్లా ఒక గుండు బొగ్గులే. అవ్వా కావాలి బువ్వా కావాలంటే ఎట్లా?... అన్నది. అవ్వంటే డబ్బని అర్థం చేసుకున్నాను. ఇన్ని త్యాగాలు చేస్తే ఆనెల 295 ఖర్చయింది.

ఇక నేను సంకోచించలేదు. డబ్బూ పోయి శనీపట్టినట్టు ఇంత ఖర్చు అవుతూండగాలేందీ, ఇంకో యాభై అయితేమటుకేమని వంటావిణ్ణి పెట్టటానికి అనుమతి ఇచ్చేశాను.

వంటావిణ్ణి పెట్టడం సులభమైన పని అనుకుని వుంటే మా ఆవిడ చాలా పొరపాటు పడింది. మొట్టమొదట మాకు కుదిరిన వంటావిడ స్టోరు రూములో సరుకు మాయం చేయసాగింది. "నిన్న వీశెడు చింతపండు కొంటే అప్పుడే సగం అయిపోయిందేమిటి?..." అని మా ఆవిడ అనేసరికి వంటావిడకు ఆగ్రహం వచ్చి చెప్పకుండా వెళ్ళిపోయింది. బియ్యండబ్బా చూసుకున్నాకగాని ఆవిడ అట్లా వెళ్ళిపోవటానికి కారణం తెలియలేదు!

ఆ తరువాత మా పాలబడిన వంటావిడ మొదటి ఆవిణ్ణి మరిపించింది. ఆవిడ మా భోజనం తినదట. నెలకు నలభై ఇవ్వమంది. నా ఉద్దేశంలో చవుకేననిపించింది. ముందు వచ్చినావిడకు రెండుపూటలూ తిండీ, కాఫీ యిచ్చి పదిహేను జీతం ఇవ్వడానికి ఒప్పుకున్నాం. తిండికింద పాతికకన్న ఎక్కువే అవుతుంది. మొదట మా ఆవిడ ఒప్పలేదు. వంటావిడ తిండిక్కూడా పాతికేమిటన్నది... మనంతినే తిండేకదా ఆవిడకూడా తింటుందీ?... అన్నాను. అదేం కుదరదు. మనతో సమంగా ఆవిడ కూరలూ అవీ తినటానికి వీల్లేదు... అన్నది. వంటచేసే మనిషిని ఎట్లా ఆపగలవు? ఒకవేళ ఆపదలిస్తే నువ్వు వంటచేసినంత పనీ చెయ్యటమేగాక, ఆవిడ అన్నం తినేటప్పుడు కాపలాకాయాలి... అన్నాను. ఈ విధంగా చాలాసేపు మాట్లాడుకున్నాక, మేం చర్చించేది ఈ వంటావిడకు వర్తించదని మాకు జ్ఞాపకం వచ్చింది. ఎందుకంటే ఈవిడ మాయింట్లో తినదు.

నేను మళ్ళా మొదటికి వచ్చి, పదిహేను వంటచేసినందుకూ పాతిక అన్నం తిననందుకూ ఇవ్వవచ్చునన్నాను. "అక్కడే మీరు పొరబడుతున్నారు. ఆవిడ ఏ పదిరూపాయలలో తన తిండికింద ఖర్చుచేసి మిగతాదంతా మిగుల్చుకుంటుంది...." అన్నది మా ఆవిడ.

"మిగుల్చుకోనీ. మనకేం?" అన్నాను.

"అట్లా వీల్లేదు...." అన్నది మా ఆవిడ.

"అయితే బేరం చేసి చూడు...." అన్నాను.

మా ఆవిడ ఆ వంటావిడతో గంటన్నర బేరంచేసి చివరకు నలభై రూపాయలివ్వటానికి ఒప్పుకున్నది. ఆపూట నేను ఆఫీసుకి అరగంట ఆలస్యంగా వెళ్ళాను.

ఈ కొత్త వంటావిడ మూడుపూటలు కాబోలు మాయింట్లో వంట చేసింది. ఆవిడ చేసిన పదార్థాలు నాకు కొంచెమైనా నోట పట్టలేదు. అయితే అయింది. మా ఆవిడ సుఖపడిపోతే అదేచాలునని మాట్లాడక ఊరుకున్నాను. కాని మా ఆవిడ మర్నాడు సాయంకాలం నేను రాగానే, వంటావిడ్ని పంపించేశాను... అనేసరికి ఆ భ్రమకాస్తా తొలగిపోయింది.

"ఏం జరిగింది?" అన్నాను.

మా ఆవిడ కోపం తెచ్చుకుంటూ.... "నేను వంటచేసినంత కాలం ఇందులో ఉప్పు తక్కువనీ, అందులో కారం తక్కువనీ, ఇది కుదరలేదనీ, అడుగంటిందనీ తప్పులు పట్టేవారే! ఆవిడవంట మాట్లాడకుండా తిన్నారే? వంట అంత బాగుందా?" అన్నది.

"ఇదీ తప్పే అయిందా? ఆవిడ వంటలో ఏదని తప్పుపట్టను? అంతా తగలబడ్డట్టే ఉంది. అందుకేనా పంపేశావు?" అన్నాను.

"అచ్చంగా అదేనా? నన్ను వంటింట్లోకి రావద్దంటుంది. నీళ్ళ బిందె ముట్టుకోవద్దంటుంది. కూరల బుట్ట తీసుకుపోయి వంటింట్లో పెట్టుకుంది. ఎంతెంత కూరలు మిగిల్చిందో చూద్దామని చెయ్యి పెట్టేప్పటికి, కూరలు మైలపడ్డాయన్నది. కూరలు మైలపట్టమేమిటండీ? ఎక్కడావినలేదు. అంట్లు సరిగా తోమలేదని పనిదాన్ని నానామాటలూ అని, ఒక్కొక్కగిన్నే మూడేసిసార్లు తోమించింది. అది నిన్నల్లాచూసి, ఇవాళ పనిలోకిరానని చెప్పేసింది. ఈ కుమ్మరం ఎవరు భరిస్తారబ్బా. రెండు రోజులకూ డబ్బిచ్చి పొమ్మన్నా" అన్నది మా ఆవిడ.

"వంటమనిషి మోజుతీరినట్టేనా? ఇంకోఛాన్సు చూస్తావా?" అని అడిగాను.

"మంచిమనిషని ఎవరన్నా చెబితేగాని పెట్టుకోను అన్నది" మా ఆవిడ.

ఆరోజో, మర్నాడో నేను మా రామారావుగారింటికి వెళ్ళాను. ఆయనకు బదిలీ అయినట్టు తెలిసింది. ఆయన మాటల సందర్భంలో, "అన్నట్టు మీకు వంట మనిషి ఎవరన్నా కావాలా?" అన్నారు. "ఎందుకా మాట అడిగారు?" అన్నాను. "మా హనుమాయమ్మ గారిని ఎక్కడన్నా మంచిచోట పెడదామని. అంత మంచి మనిషి దొరకటం మాటలండీ?" అన్నాడు రామారావుగారు.

మా ఆవిడ అన్నమాట జ్ఞాపకం వచ్చింది. ఇంతకంటె మంచి సిఫార్సు ఏంకావాలి? రామారావుగారు ఒక్క డబ్బు విషయంలోనేగాక అన్ని విషయాల లోనూ ఎంతో జాగర్తగల మనిషి. అల్పసంతోషి ఎంతమాత్రం కాదు. "సరే, మీరు వెళ్ళిపోయేప్పుడు ఆవిణ్ణి మాయింటికి

పంపండి, "ఆవిడ కేమి యిస్తున్నారు?" అని రామారావు గార్ని అడిగాను. "భోజనం పెట్టి పదిహేను రూపాయలిస్తున్నాం. అది మామూలే" అన్నాడు రామారావుగారు.

రామారావుగారు బదిలీ అయిన మర్నాడు హనుమాయమ్మగారు మా యింటికి వచ్చేసింది. మిగిలిన విషయాలు ఎల్లా వున్నా హనుమాయమ్మగారిది నలభీమపాకం. కాని మా ఆవిడ నసగడం ప్రారంభించింది. "ఈవిడ చూస్తే అత్తగారల్లేవుందిగాని వంటావిడల్లేలేదు" అన్నది. ఏం జరిగింది? "సంసారాలు చేసేవాళ్ళిట్లా చేసుకుంటారా? అట్లా చేసుకుంటారా అని నన్ను సాధిస్తుందేమిటి? ఈవిడచేత సాధింపులు పడటానికా వంటమనిషిని పెట్టుకున్నది?" అన్నది మా ఆవిడ.

"నెల సాంతం గడవకుండా ఈవిణ్ణి మార్చటానికి వీల్లేదు. మా అమ్మలాటిది, ఆపాటి అనవచ్చునులే" అన్నాను.

నెల అయిపోతుందనగా మా ఆవిడ "ఈ వంటావిణ్ణి మారుద్దామండీ. ఆ తిరుమలాంబగారు వంటమనిషికి నెలకు పదే ఇస్తున్నారట. ఈవిడకు పదిహేనెందుకూ?" అన్నది.

"అయిదు రూపాయలు నష్టపడుతున్నామనా నీ విచారం? ఈ నెల ఇంటి ఖర్చు ఎంతయిందో తెలుసా?" అన్నాను.

"ఎంతయింది?" అన్నది మా ఆవిడ.

"రెండు వందల నలభై. హనుమాయమ్మగారి జీతం ఇరవైకి పెంచబోతున్నాను. తిరుమలాంబగారు ఆవిడకీ అంతా యిస్తారని అన్నది; కావలిస్తే ఆవిణ్ణే అడుగు" అన్నాను.

"మీ కిదంతా ఎట్లా తెలిసిందీ?" అన్నది మా ఆవిడ తెల్లబోయి.

"హనూమాయమ్మగారు నాకెప్పటికప్పుడు చెబుతూనే వుంది. కాకపోయినా నువ్వొక్క జబ్బు వదిలించుకోవాలి. నువ్వు యజమానురాలివనీ, ఆవిడ నౌకరనీ మరిచిపో. ఆ రోజులు అయిపోయినై" అన్నాను.

ఆ మాట అన్నందుకు మూడు రోజులు మా ఆవిడ నాతో సరిగా మాట్లాడలేదు. మీ దయవల్ల హనుమాయమ్మగారు మాత్రం మా యింటిలోనే వున్నది, వుంటుంది కూడానూ!

***ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?***
***జయా పబ్లికేషన్స్, విజయవాడ***